## ఫెంగ్ షుయి



### వాయవ్య దిశలో ఎరుపురంగు వద్దు

ఎరుపు విప్లవానికి చిహ్నం. ఎరుపు చైతన్యానికి చిహ్నం. ఎరుపు సౌభాగ్యానికి చిహ్నం. ఇంతటి ప్రాముఖ్యమున్న ఎరుపును ఇంట్లో ఎక్కడబడితే అక్కడ ఉపయోగించకూడదు. ముఖ్యంగా ఇంట్లోని వాయవ్య దిశలో ఎరుపురంగు వస్తువులు ఉంచకూడదు. వాయవ్య దిశ అనేది కుటుంబసభ్యుల మార్గదర్శకులకు, సన్నిహితులు, స్నేహితులకు సంబంధించినది. వాయవ్య దిశ లోహతత్వం గలది. అందువలన తమ మార్గదర్శకులతో, స్నేహితులతో సంబంధాలు బాగుండాలంటే వాయవ్య దిశలో లోహంతో తయారైన వస్తువులు ఉంచితే మంచిది. ముఖ్యంగా లోహంతో తయారయిన ఆరుగొట్టాల గాలిగంటను వ్రేలాడదీయాలి. ఇలా చేయడం వలన తమ స్నేహితులతో సంబంధాలు బాగుండి భాగ్యాన్ని పొందుతారు. అదేవిధంగా వాయవ్య దిశలో తీక్షణమైన కాంతిని ఇచ్చే దీపాలు ఉంచరాదు. ఇలా ఉంచడం వలన ఎక్కువ దుష్పరిణామాలు తలెత్తుతాయి. ఎరుపు రంగు వస్తువులు కూడా వాయవ్య దిశలో ఉంచకూడదు. ఎరుపు రంగును చాలామంది అగ్నికి గుర్తుగా వాడుతుంటారు. వాయవ్య దిశలో ఎరుపురంగును ఉంచడం వలన ఆ కుటుంబ సభ్యులకు, వారి స్నేహితులకు మధ్య నిప్పు రాజుకున్నట్టవుతుంది. దీంతో వారి మధ్య సంబంధ బాంధవ్యాలు దెబ్బతింటాయి. మిత్రుల నుంచి సహాయం అందడం అటుంచి, వారి నుంచి ద్రోహం జరిగే అవకాశం ఉంది. అత్యవసర సమయంలో ఆదుకునే వారు కరువవుతారు. అందువలన ఎవరూ తమ ఇంట్లోని వాయవ్య మూల ఎరుపు రంగు వస్తువులు ఉంచరాదు. అదే సమయంలో లోహంతో తయారయిన గంటలను వాడటం వలన శుభాలు చేకూరుతాయి.

వారం వారం 'ఫెంగ్ షుయి' మీకోసం

## 'సరసి' కత

వైశంపాయనుడు కాశీ వెళ్లినప్పుడు పెద్దవాళ్లకు తర్పణాలు వదిలేవేళ ఆ తంతు చేయించే పాండా ''ఇక్కడ మీ కిష్టమైన కూర ఏదైనా వదిలి పెట్టాలి. చెప్పండి. ఏం వదులుతారు?'' అని అడిగేడు. వైశంపాయనుడు ఆలోచనలో పడ్డాడు – తనకి అన్నీ ఇష్టమైన కూరలే. (అసలు తిండే తనకిష్టమైన సబ్జెక్టు) ఏది వదిలాలి?

ఇంతలో పాండా తన అసిస్టెంటుతో ఏదో మాట్లాడుతూ కోపంగా హిందీలో ''క్యాబే?'' అని గట్టిగా అరిచాడు. దానికి అసిస్టెంటు వినమ్రంగా ''జీ'' అన్నాడు. రెండూ కలిపి ''క్యాబేజీ''గా వినబడేసరికి వైశంపాయనుడు అప్రయత్నంగా ''క్యాబేజీ'' అనేశాడు పైకి. పాండా ఫ్రీజ్ చేసి, మంత్రం చదివి, లాక్ చేసేశాడు.

ఇంటికొచ్చేక క్యాబేజీ వదిలిపెట్టినందుకు ఎంతో దుఃఖించాడు వైశంపాయనుడు. టీవీలో 'వంటల వెంకటలక్ష్మి' కార్యక్రమంలో 'క్యాబేజీతో రకాలు' గురించి చెబుతున్నప్పుడు నోరూరి, తను చేసిన దానికి కుమిలి కుమిలి రోదించాడు.




భర్త బాధ చూడలేకపోయింది సుబ్బాయమ్మ గారు. ''పోనీలెండి, క్యాబేజీ అనేది మన దేశం కూర కాదు. కాబట్టి అది వదిలినా వదలకపోయినా ఒకటే. అంచేత మీరు తినొచ్చు. ఈసారి వెళ్లినప్పుడు వేరేది వదులుదురుగాని. అయినా చిత్తశుద్ధివుండాలి గానీ ఇటువంటివి బలవంతంగా వదిలినంత మాత్రాన ప్రయోజనం ఏమిటి?'' అంది. తర్వాత, భర్త బదులు క్యాబేజీను తను త్యాగం చేసింది సుబ్బాయమ్మగారు. ''నిజంగా నువ్వు గ్రేటే!'' అన్నాడు వైశంపాయనుడు క్యాబేజీ పకోడీలు నోట్లో వేసుకుంటూ.

*